లెనిన్ ఓ క్రాంతి శిఖరం

- విప్లవోద్యమాలకు దిక్సూచి
- జీవితాంతం ఆచరణవాదిగానే ఉన్నారు
- భౌతిక వాదాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత విప్లవకారులదే
- దేశంలో హిందూత్వ భావాలు పెరుగుతున్నాయి
- లెనిన్ రచనల్లో వీటికి సమాధానాలున్నాయి..
- లెనిన్ శత వర్ధంతి సభలో బివి రాఘవులు

లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బివి రాఘవులు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

" లెనిన్ మరణించి నూరేళ్లవుతోంది. కానీ ఆయన జీవించిన కాలంలో నిర్వహించిన పాత్ర చరిత్రను వెలిగిస్తూ, వర్తమానాన్ని నడిపిస్తూ, భవిష్యత్‌కు మార్గం చూపుతూనే ఉంది. దోపిడీ అసమానతలు లేని సమాజం కేవలం ఆదర్శం మాత్రమే కాదు, వాస్తవం అని ప్రపంచానికి అనుభవంలోకి తెచ్చిన అక్టోబర్ విప్లవ సారథి లెనిన్. ఆ మహానాయకుని విప్లవ దార్శనికత ఎప్పటికీ సజీవం" అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. చరిత్ర గమనంలో నిన్న, నేడు, రేపు సదా లెనిన్ సజీవుడేనని వ్యాఖ్యానించారు.

లెనిన్ జీవితాంతం ఆచరణవాదిగానే ఉన్నారని, ప్రతి కమ్యూనిస్టు ఆయన అడుగుజాడల్లో నడువాలని రాఘవులు సూచించారు. దోపిడీ, అసమానతలు, ఆర్థిక సంక్షోభం లేని కష్టజీవుల రాజ్యం రావాలని, ఆ దిశగా సోవియట్ రష్యా అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ శత వర్ధంతి' సభను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ సమాజాన్ని పురోగమనం వైపునకు నడిపించాలనే వారికి లెనిన్ ఎప్పటికీ మార్గదర్శకుడేనని చెప్పారు. అధ్యయనం, ఆచరణల మేళవింపు లెనిన్ అన్నారు. ప్రతి అంశాన్నీ భిన్న కోణాల్లో అధ్యయనం చేయడం ఆయన వల్లనే సాధ్యమైందన్నారు. మార్క్స్, ఏంగెల్స్‌ల సైద్ధాంతిక అంశాలను లెనిన్ మరింత అభివృద్ధి చేశారన్నారు. ఆచరణలో రుజువు చేశవారని చెప్పారు. రష్యన్ విప్లవానికీ, ప్రపంచంలోనే మొట్టమొదటి శ్రామిక రాజ్య నిర్మాణానికి అద్భుతమైన నాయకత్వాన్ని అందించారని గుర్తు చేశారు. నాటి పాలక వర్గాలు కష్టజీవులను గందరగోళపర్చటానికి చేసే వాదనలను ఎండగడుతూ విశ్లేషణాత్మకమైన రచనలు చేశారని గుర్తు చేశారు. అప్పటికే సమాజంలో వ్యాపించి ఉన్న సైద్ధాంతిక ప్రచారాలను పరిశీలించి వాటిని విమర్శణాత్మకంగా బట్టబయలు చేశారని వివరించారు. భౌతిక వాదం, ఆచరణవాదం విమర్శ ఆయన ముఖ్యమైన రచనగా చెప్పొచ్చన్నారు. భౌతిక వాదాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత విప్లవ కారులపైనే ఉందన్నారు. ఆ వాదాన్ని రక్షించుకోకపోతే.. భావవాదం విస్తారంగా ప్రజల్లో వ్యాపిస్తుందని, అది విప్లవానికి ఆటంకంగా తయారవుతుందని చెప్పారు.

భౌతికవాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లకపోవడం వల్ల నేడు మన దేశంలో భావవాదం విస్తృతంగా చలామణి అవుతుందని బివి రాఘవులు అన్నారు. అధికారాన్ని కాపాడుకునేందుకు భావవాదం పాలకులకు ఒక ఆయుధంగా మారిందని చెప్పారు. దోపిడీని రక్షించటమే భావవాదం లక్షణమని లెనిన్ విశదీకరించారని గుర్తుచేశారు. రాజకీయ, సామాజిక, విద్యా తదితర అన్ని వ్యవస్థల్లో భావవాదం ఇమిడి ఉంటుందనీ, దాన్ని నిలువరించే బాధ్యత విప్లవకారులదేనని నొక్కి చెప్పారు. కాలం మారుతున్న కొద్దీ కొత్తకొత్త సవాళ్లు ముందుకు వస్తుంటాయని, వాటికనుగుణంగా మన ఆలోచనలు కూడా మార్చుకోవాలని సూచించారు. 1906లో విప్లవం ఓడిపోయిన తర్వాత అంతటా నిరాశ..నిస్పృహలు ఏర్పడ్డప్పుడు లెనిన్ నిబ్బరంగా ఉన్నారన్నారు. ఎన్నో సవాళ్లను ఎదురొడ్డి 1917లో విప్లవాన్ని సాధించారని తెలిపారు. భారతదేశంలో హిందూత్వ భావాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భావవాదాన్ని రోజువారీ యుద్ధంలో ఎలా ఎదుర్కోవాలో లెనిన్ రచనలు ఉపయోగపడతాయన్నారు. అదే విధంగా ఆర్థిక శాస్త్రంలో కృషి ఎంతో చేశారన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు అర్థం చేసుకునేందుకు ప్రత్యేక రచనలు చేశారన్నారు. 1991లో పరిస్థితి మారిందన్నారు. భావజాల రంగాన్నంతా పెట్టుబడి తనగుప్పెట్లో పెట్టుకుందన్నారు. ప్రపంచాన్నంతా ఇప్పటికే గుత్తాపెట్టుబడి దారి వర్గం కంట్రోల్ చేస్తుందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో చనిపోయిన వారికంటే.. ప్రాంతీయ యుద్ధాల్లో చనిపోయిన వారు 20 రెట్లు ఎక్కువగా ఉంటారని చెప్పారు. ఇంధన వనరులపైన ఆధిపత్యం కోసం తెగల మధ్య ఘర్షణలను సృష్టింటమే సామ్రాజ్యవాద లక్షణమని వివరించారు. సామ్రాజ్య వాదంపై పోరాటంలో శ్రామిక వర్గానికి లెనిన్ గొప్ప ఉత్తేజిమిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొన్నారు.

మూసీ పునరుద్ధరణతో హైదరాబాద్‌కు మహర్దశ

- ప్రపంచ దృష్టిని ఆకర్షించే డిజైన్ల ఎంపికకు కసరత్తు
- దుబాయ్ కంపెనీలతో సిఎం రేవంత్‌రెడ్డి సంప్రదింపులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ నది పునరుద్ధరణతో హైదరాబాద్ నగరానికి మహర్దశ పట్టనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. లండన్ పర్యటన ముగించుకుని దుబాయి చేరుకున్న సిఎం ప్రపంచ స్థాయి సిటీ ప్లానర్లు, డిజైనర్లు, మెగా మాస్టర్ ప్లాన్ డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లతో వరుసగా భేటీ అయ్యారు. మూసీ పొడవునా చేపట్టనున్న గ్రీన్ అర్బన్ పార్కులు, వాణిజ్య సముదాయాలు, నడక దారులు మొదలగు అభివృద్ధి పనులను వారికి వివరించారు. రివర్స్ ఫ్రంట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లు, నమూనాలు, వాటికి అవసరమైన పెట్టుబడులపై వివిధ సంస్థలతో చర్చలు జరిపారు. "చారిత్రాత్మక నగరాలన్నీ నీటి వనరుల చుట్టే అభివృద్ధి చెందాయి. నదులు, సరస్సులు వాటికి సహజత్వాన్ని తెచ్చిపెట్టాయి. మూసీ పునరుద్ధరణతో హైదరాబాద్ సిటీ ప్రపంచంలోనే అద్భుతమైన నగరంగా మారుతుంది" అని సిం వారితో అన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మూసి ప్రాజెక్టుకు అద్భుతమైన డిజైన్లు, నమూనాలు రూపొందించాలని కోరారు. దేశంలోని ఇతర పట్టణాలు, రాష్ట్రాలతో తాము పోటీ పడటం లేదనీ, ప్రపంచంలోనే అత్యుత్తమమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సిఎం 70 సంస్థలతో సంప్రదింపులు జరిపారు. అన్ని సంస్థలు తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి ఆసక్తి ప్రదర్శించాయి. తదుపరి సంప్రదింపులకు త్వరలోనే రాష్ట్రానికి వచ్చేందుకు అంగీకరించాయి. ఈ చర్చల్లో సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, సీఎం స్పెషల్ సెక్రెటరీ బి.అజిత్ రెడ్డి, హెచ్ఎండిఎ అదనపు కార్యదర్శి అమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టు సందర్శన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర అధికారుల బృందంతో కలిసి దుబాయ్ వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టును సందర్శించారు. ఆదివారం మధ్యాహ్నం స్కై స్కాపర్ (ఆకాశ హర్మ్యం)పైకి వెళ్లి ఏరియల్ వ్యూలా కనిపించే వాటర్ ఫ్రంట్‌ను తిలకించారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న ఈ ప్రాజెక్టు నిర్వహణ, నిర్మాణానికి పట్టిన సమయం, వ్యయం, తదితర విషయాలపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మోడల్ స్కూల్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (టిఎస్ఎంఎస్‌టిఎఫ్) ప్రచురించిన 2024 కేలండర్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.కొండయ్య, డాక్టర్ యస్.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, కోశాధికారి లక్ష్మారెడ్డి, పి.క్రాంతి కుమార్, డాక్టర్ రంజిత్, విజయేందర్, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్స్ ఎడిటర్ మాణిక్ రెడ్డి, తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కన్వీనర్ రాధే శ్యామ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వం

- నిరంకుశ, నియంతృత్వ పాలన పోయింది
- 25 గ్రామపంచాయతీ భవనాలు నిర్మించా : మంత్రి ఉత్తమ్

సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ప్రభుత్వం దశాబ్ద కాలంలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని, అప్పుడు ప్రభుత్వం సహకరించకున్నా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో 25 గ్రామపంచాయతీ భవనాలు నిర్మింపచేశానని భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో నిరంకుశ, నియంతృత్వ పాలన పోయి ప్రజాపాలన వచ్చిందని తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని కాల్వపల్లి, పాతదోనం బండ తండాల్లో సిఎస్ఆర్ నిధులతో ఒక్కో గ్రామపంచాయతీకి రూ.25 లక్షలతో గ్రామపంచాయతీ భవనాలు, రూ.13 లక్షలతో ఒక్కో అంగన్వాడీ భవనాలను, లాల్ తండాలో ఎన్ఆర్‌జిఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కోసం రూ.11.50 లక్షలతో కావాల్సిన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అధికారంలోకొచ్చిన కెసిఆర్ ప్రభుత్వం స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లాపరిషత్‌లను నిర్వీర్యం చేసిందన్నారు. ఇటీవల మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ సర్పంచుల కష్టాలు తీర్చాలని అంటున్నారని, వారిని కష్టాలపాలు చేసిందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. సర్పంచులు ఆర్థిక బాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారని, ఉన్న ఆస్తులు అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవరం లిఫ్టు పనిచేసేలా చూడాలని రైతులు కోరగా 15 రోజుల్లో పనిచేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సినీ నిర్మాత బండ్ల గణేష్, పంచాయతీరాజ్ ఎస్‌సి రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వెంకట్‌రెడ్డి, ఆర్‌డిఒ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మంగ, ఎంపిడిఒ జానకిరాములు, డిఎల్‌పిఒ శ్రీరాములు, డిఎస్‌పి ప్రకాష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిపై కార్యాచరణ రూపొందించండి

- సిఎం రేవంత్ రెడ్డికి జూలకంటి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన జాబ్ కేలండర్ హామీ ప్రకారం ఆరు మాసాలలోపు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతికి (నెలకు నాలుగువేలు) అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సిపిఎం మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం సిఎం రేవంత్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగ యువకులు ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకుని ఇంత కాలం వేచి చూస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం వల్ల వయోపరిమితి దాటి ఒక తరం యువత ఉద్యోగాలు పొందే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. వారు శాశ్వత నిరుద్యోగులుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా, వైద్య రంగాల్లో కలిపి దాదాపుగా 40 వేల పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఆస్పత్రుల్లో పోస్టులు ఖాళీ ఉండడం వల్ల ఈ రంగాలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయని తెలిపారు. పేద, మధ్యతరగతి, ప్రజలకు కనీస సౌకర్యాలు అందక చాలా ఇబ్బందులకు గురౌతున్నారని పేర్కొన్నారు.

BEFORE THE HON'BLE ADDL. LXXXIV CITY CIVIL AND SESSIONS JUDGE (CCH-85) BENGALURU
Comm. A.A. No. 160/2023
IN THE MATTER OF
M/s. CATERPILLAR FINANCIAL SERVICES INDIA PVT. LTD., 6th Floor, Tower 'B', Prestige Shantiniketan, The Business Precinct, Whitefield Main Road, Bengaluru, Karnataka-560048.
...APPLICANT
AND
SUDHABHAVI KRISHNA & ANR
...RESPONDENTS
Service of Court Summons to Respondent No. 2 through Paper Publication
R2) 1. Sudhabhavi Krishna, H.No. 3-108, Dharur Mandal Purnapalem, Pathapalem, Mahabub Nagar, Telangana - 509125.
Whereas the Applicant has filed the above Application against you to provide adequate security to the Applicant Company equivalent to an amount of **Rs. 48,06,769/-** so as to cover the outstanding loan amount due to the Applicant Company. Take notice that the above case is posted for your appearance **on 07.02.2024.** If you have any defence, you are required to appear before the court either in person or through advocate, duly authorised on the aforesaid date of hearing, failing which the matter will be decided on merits placing you ex-parte.
SCHEDULE OF VEHICLE
A. SCHEDULE
Equipment : Caterpillar 320D3GC
Maker's Name : Caterpillar
Model No. : 320D3GC
Serial No. : FLD01015
Given under my hand and seal on this 20th December 2023 at Bangalore.
By order of the Court, Sheristedar, City Civil Court, Bengaluru.
Advocate for Applicant :
#117, Ashwin Arcade, 3rd Floor, Sanjay Nagar Main Road, RMV II Stage, Ashwathnagar, Bangalore, Karnataka-560094.

అర్హులందరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలి

- రాష్ట్ర ఎలక్టోరల్ పరిశీలకులు దేవసేన
- సిరిసిల్లలో 112, 113 పోలింగ్ బూత్‌ల తనిఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను తప్పనిసరిగా ఓటరు జాబితాలో చేర్చాలని రాష్ట్ర ఎలక్టోరల్ పరిశీలకులు దేవసేన ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2024లో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణం గీతానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 112, 113 పోలింగ్ బూత్‌ల్లో బిఎల్ఒల ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక సంక్షిప్త, పునరీక్షణ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి ఆమె తనిఖీ చేశారు. పోలింగ్ బూత్ పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు..? స్పెషల్ క్యాంపెయిన్ డేలో భాగంగా ఎంతమంది నుంచి కొత్త ఓటరు నమోదు, సవరణల దరఖాస్తులు స్వీకరించారు..? చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారా..? అనే వివరాలను ఆమె సంబంధిత బూత్ స్థాయి అధికారు లను అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకునేందు కు అవసరమైన 6, 7, 8 దరఖాస్తు ఫారాలను బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయా? అనే వివరాలను ఆరా తీశారు. ఆరోగ్యకరమైన ఓటరు జాబితా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేసేందుకు క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన యువతీ యువకులతో ఆమె మాట్లాడారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో విలువైన ఆయుధమని, ఓటు విలువను తెలుసుకుని, ఎన్నికల్లో తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. మీ స్నేహితుల్లో ఎవరైనా ఓటరు నమోదుకు అర్హులైన వారు ఉంటే వెంటనే వారితో దరఖాస్తు చేయించాలని కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త, పునరీక్షణ కార్యక్రమం జిల్లాలోని 547పోలింగ్ బూత్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరు జాబితాలో నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.. దేవసేనకు వివరించారు. తనిఖీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఆర్‌డిఒ ఆనంద్ కుమార్, తహసీల్దార్ షరీఫ్ మోహినుద్దీన్, ఉప తహసీల్దార్ విజయ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE ADDL. LXXXIV CITY CIVIL AND SESSIONS JUDGE (CCH-85) BENGALURU
Comm. A.A. No. 160/2023
IN THE MATTER OF
M/s. CATERPILLAR FINANCIAL SERVICES INDIA PVT. LTD., 6th Floor, Tower 'B', Prestige Shantiniketan, The Business Precinct, Whitefield Main Road, Bengaluru, Karnataka-560048.
...APPLICANT
AND
SUDHABHAVI KRISHNA & ANR
...RESPONDENTS
Service of Court Summons to Respondent No. 2 through Paper Publication
R2) 1. Telgu Nagesh, 4-37/2, Kothulagidda Dharur Alwalpad, Mahabub Nagar, Andhra Pradesh-509125.
Whereas the Applicant has filed the above Application against you to provide adequate security to the Applicant Company equivalent to an amount of **Rs. 48,06,769/-** so as to cover the outstanding loan amount due to the Applicant Company. Take notice that the above case is posted for your appearance **on 07.02.2024.** If you have any defence, you are required to appear before the court either in person or through advocate, duly authorised on the aforesaid date of hearing, failing which the matter will be decided on merits placing you ex-parte.
SCHEDULE OF VEHICLE
A. SCHEDULE
Equipment : Caterpillar 320D3GC
Maker's Name : Caterpillar
Model No. : 320D3GC
Serial No. : FLD01015
Given under my hand and seal on this 20th December 2023 at Bangalore.
By order of the Court, Sheristedar, City Civil Court, Bengaluru.
Advocate for Applicant :
#117, Ashwin Arcade, 3rd Floor, Sanjay Nagar Main Road, RMV II Stage, Ashwathnagar, Bangalore, Karnataka-560094.

పురుషులకూ ఉచిత బస్సు ప్రయాణం ఎందుకు ఇవ్వకూడదు?

- దానివల్ల ఆర్థిక సామాజిక జీవన ప్రమాణాలు పెరుగుతాయి
- ప్రజారవాణా ప్రభుత్వాల బాధ్యతే...
- టిఎస్ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర సదస్సులో ప్రొఫెసర్ కె నాగేశ్వర్

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మహాలక్ష్మి' స్కీం ద్వారా టిఎస్ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారనీ, ఈ అవకాశాన్ని పురుషులకూ ఎందుకు వర్తింపచేయ కూడదని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె నాగేశ్వర్ అన్నారు. ఈ స్కీం కచ్చితంగా మహిళల స్వావలంబనకు ఉపయోగపడుతుంద ని, పురుషులకూ వర్తింపచేస్తే ఆయా కుటుంబాల ఆర్థిక సామాజిక జీవన ప్రమాణాలు పెరుగుతాయని విశ్లేషించా రు. టిఎస్ఆర్‌టిఇ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యాన ఆదివారం నాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో 'ఆర్‌టిసి అభివృద్ధి-ప్రజల ప్రయోజనాలు-కార్మికుల సంక్షేమం' అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజారవాణా ప్రభుత్వాల బాధ్యతే అనీ, దాన్ని లాభనష్టాలతో బేరీజు వేయరాదని చెప్పారు. 'మహాలక్ష్మి' అమల్లోకి వచ్చాక బస్సుల్లో మహిళల ప్రయాణాలు 60 శాతం పెరిగాయని గణాంకాలు చెప్తున్నాయనీ, ఈ పథకం ప్రయోజనాలను రాజకీయ పార్టీలే అనుభవిస్తాయి కాబట్టి, వాటిని సక్రమంగా అమలు చేసే బాధ్యత కూడా వారే స్వీకరించాలని అన్నారు. అయితే గతంలో ఆర్‌టిసికి రావల్సిన రీయింబర్స్‌మెంట్ సొమ్ముల్ని సక్రమంగా చెల్లించకపోగా, నష్టాల్లో ఉందని ప్రచారం చేశారని చెప్పారు.

ప్రస్తుతం ఆర్‌టిసిలో రిటైర్ అయిన వారికీ సకాలంలో సక్రమంగా బెనిఫిట్స్ చెల్లించట్లేదనీ, ఈ పరిస్థితుల్లో మార్పులు తెచ్చేలా ప్రభుత్వ కార్యాచరణ ఉండాలని ఆకాంక్షించారు. ఉచిత ప్రయాణం, జీరో టిక్కెట్లు, ఇతర రాయితీల సొమ్మును ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తే, ఆర్థిక పరిస్థితుల్లో మెరుగైన మార్పులు వస్తాయని సూచించారు. దానికి అవసరమైన సొమ్మును రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, కొత్త గ్రామాలకూ ఆర్‌టిసి బస్సుల్ని అనుసంధానం చేయాలని కోరారు. లాభ నష్టాలతో ఆర్టీసీని ముడిపెట్టడం సరికాదనీ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజారవాణా బాధ్యత ప్రభుత్వాలదే తప్ప, ఆర్టీసీ వంటి సంస్థలది కాదని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా పలుదేశాల్లోని ప్రజా రవాణా వ్యవస్థల్ని విశ్లేషించి చెప్పారు. ప్రజరవాణా కు సాంకేతికతను జోడిస్తే అద్భుత ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలందరికీ ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ పరిరక్షణ బాధ్యత ప్రజలదే అనీ, కార్మిక హక్కుల సాధనకు ప్రజాసహకారం అత్యవసరమని వివరించారు. ఈ మేరకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ 'మహాలక్ష్మి' సొమ్మును ప్రభుత్వం ఎప్పటికప్పుడు రీయింబర్స్‌మెంట్ చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు అలా చేయకపోవడం వల్లే ఆర్‌టిసి నష్టాల్లోకి వెళ్లిందని విశ్లేషించారు.

కేంద్ర ప్రభుత్వం రవాణారంగంలో అనేక మార్పులు చేసిందనీ, అవి ఆర్‌టిసిలకు ఇబ్బందిగా మారాయని తెలిపారు. ఎనిమిది గంటల పనిదినాలను రద్దు చేసి, ఆ స్థానంలో 12 గంటల పనిదినాలు ఏర్పాటు చేస్తున్నారనీ, హిట్ అండ్ రన్ వంటి చట్టాల ద్వారా రవాణారంగాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నా రని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని, ఒకప్పుడు టాప్ టెన్ దేశాల్లో ఒకటిగా ఉండే భారతదేశం ఇప్పుడు కిందికిదిగజారి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు 'ఆర్టీసీ అభివృద్ధి- ప్రజల ప్రయోజనాలు- కార్మికుల సంక్షేమం' అనే మూడు అంశాలపై సదస్సులో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రజా భాగస్వామ్యం, ఆర్‌టిసి పరిరక్షణ, ప్రభుత్వాల బాధ్యత, కార్మికుల కష్టనష్టాలనూ వాటిలో ప్రస్తావించారు. సభకు ఫెడరేషన్ అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. అంతకు ముందు ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు పద్మావతి వక్తల్ని వేదికపైకి ఆహ్వానించారు. ప్రచార కార్యదర్శి పి రవీందర్‌రెడ్డి వందన సమర్పణ చేశారు. అంతకు ముందు సదస్సులో వివిఎస్ రావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కోశాధికారి గంగాధర్, నాయకులు ఎవి రావు, బిక్షపతి, కేవీఎస్ రెడ్డి, ఎమ్‌బీ రావు, ఎల్లయ్య, కృష్ణ, సుధాకర్, జీఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు

డైరీ ఆవిష్కరణలో పోతినేని, సాగర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి.సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, రాష్ట్ర నాయకులు టి.కిషోర్, టిపిఎస్‌కె రాష్ట్ర నాయకులు జి.రాములు తదితరులు చైతన్య సేద్యం 2024 డైరీని ఆవిష్కరించారు. చైతన్య సేద్యం పత్రిక ఎడిటర్ ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేయడంతోపాటు కేరళ తరహా రుణ విమోచన చట్టం చేయాలని కోరారు. సహకార రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే రాబోయే కాలంలో మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామని కేంద్రాన్ని హెచ్చరించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయన్నారు. వాటిని నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. 'మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి.కార్పొరేట్లను తరిమికొట్టాలి. దేశాన్ని రక్షించాలి' అనే నినాదంతో ఈ నెల 26న దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగు గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

IN THE COURT OF THE III ADDL, SENIOR CIVIL JUDGE;; AT; SECUNDERABAD
S.O.P. No. 32 of 2023
BETWEEN:
Badhanapuram Ram Raj
...Petitioner
AND
1. The Life Insurance Corporation, Ameerpet, City Branch Xi, Hyderbad.
2. To Whomsoever it may concern (Respondent No. 2)
...Respondents
To
Whomsoever it may concern
TO WHOMSOEVER IT MAY CONCERN
The above named petitioner has filed s.o.p. No. 32 of 2023 on the file of the III Senior Civil Judge, Secunderabad for issue of Succession Certificate by declaring the petitioner as legal heir of deceased No.1 Late B. Praveen Raj and deceased No. 2 B. Kamala Bai and he is entitled to receive the maturity amount of theLIC Bond No 646935767 on account of death of B.Praveen Raj form the respondent No.1 L.I.C office. The matter stands posted to 05-02-2024. If anybody has claim or objection in respect of the same they can appear before the Hon'ble court on the above said dat at 10-30 A.M either in person or through any counsel duly instructed on their behalf. Otherwise the matter will be decided as per law.
(BY ORDER OF COURT)
ADVOCATE
Chamber at: Plot No. 18, TSSEB Colony, Hyderguda, Prakash Nagar, Upperpally Village, Rajendra Nagar Mandal, Ranga Reddy District
Cell No. 9394712155

అయోధ్యకు సిగ్నిఫై లైట్స్

హైదరాబాద్ : ఆయోధ్యలోని రామ మందిర్‌కు తాము ప్రత్యేక లైటింగ్స్‌ను అందించామని సిగ్నిఫై తెలిపింది. మేక్ ఇన్ ఇండియా నిబద్ధతకు అనుగుణంగా లైట్స్‌ను తీర్చిదిద్దామన్నారు. మందిరంలోని ముఖ్యమైన రామ్‌పథ్‌లో 110 ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఫిలిప్స్ అలంకార స్తంభాలను ఏర్పాటు చేసినట్లు సిగ్నిఫై ఇండియా సిస్టమ్స్ అండ్ సర్వీసెస్ బిజినెస్ హెడ్ వికాస్ మల్హోత్రా పేర్కొన్నారు.

ప్రభుత్వ సలహాదారులుగా ముగ్గురు

- ఢిల్లీ ప్రభుత్వ ప్రతినిధిగా మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా ఆ ముగ్గురిని నియమించింది. సిఎం సలహాదారుగా మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నేత హర్కర వేణుగోపాల్‌ను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్యే మల్లు రవిని నియమించింది. ఆ నలుగురికీ క్యాబినెట్ హోదా కల్పిస్తున్నట్టు పేర్కొంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా షబ్బీర్‌అలీ, ప్రోటోకాల్, పబ్లిక్ రిలేషన్స్ సలహాదారుగా వేణుగోపాల్‌కు బాధ్యతలు అప్పగించింది.

28న ఇనార్బిట్ దుర్గం చెరువు రన్

హైదరాబాద్ : జనవరి 28న ఇనార్బిట్ దుర్గం చెరువు రన్ (ఐడిసిఆర్) 2024ను నిర్వహించనున్నారు. రేస్ రూట్, అధికారిక టీ-షర్ట్, మెడల్, ఛారిటీ బిబ్‌లను మాదాపూర్ డిసిపి డాక్టర్ జి వినీత్, ట్రాఫిక్ డిసిపి టి శ్రీనివాసరావు, కె రహేజా కార్ప్ సిఇఒ శ్రవణ్ గోనె, డిసిపి సృజన ఆవిష్కరించారు. దీన్ని ఇనార్బిట్ మాల్ సైబరాబాద్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్, ది వెస్టిన్, మాదాపూర్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న రన్నర్లు 21 కిమీ, 10 కిమీ, 5 కిమీల మూడు విభాగాలలో పోటీపడతారు. "ఐడిసిఆర్ కమ్యూనిటీకి చెందిన సభ్యులతో పాటు ఈ రన్‌లో దాదాపు 100 మంది దివ్యాంగులు కూడా పాల్గొంటారు. మొత్తం బహుమతి రూ.ఆరు లక్షలు కాగా , వివిధ విభాగాల్లోని 48 మంది రన్నర్‌లకు ఇది అందించబడుతుందని.. దాదాపు 6500 మంది ఈ రన్‌లో పాల్గొనే అవకాశం ఉంది" అని ఇనార్బిట్ మాల్ హైదరాబాద్ సెంటర్ హెడ్ శరత్ బెలవాడి పేర్కొన్నారు.

ద్రోణాచార్య ఎఫ్ఐఐటి జెఇఇ స్కాలర్‌షిప్ టెస్ట్

హైదరాబాద్ : ప్రముఖ కోచింగ్ సంస్థ ద్రోణాచార్య 360-డిగ్రీ డయాగ్నోస్టిక్ ఎఫ్ఐఐటి జెఇఇ విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. జనవరి 28 నుంచి ఫిబ్రవరి మధ్య ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఐదు నుంచి 11 తరగతి విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చని తెలిపింది. ఎఫ్ఐఐటి జెఇఇలో చేరాలనే విద్యార్థులకు ఈ పరీక్ష అనేక ప్రయోజనాలను చేకూర్చనుందని ఆ సంస్థ హెడ్ వినోద్ అగర్వాల్ పేర్కొన్నారు. జనవరి 26వ తేది వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

గులాబీ దండుకు పదవుల గండం

- కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో అవిశ్వాస సెగలు
- ప్రభుత్వం మారడంతో మేయర్, చైర్మన్ పీఠంపై గురి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకున్న నేపథ్యంలో మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 'అవిశ్వాసం' మరోసారి తెరపైకి వచ్చింది. అధికార మార్పిడికి అసంతృప్తి తోడవ్వడంతో కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాస పిడుగు పడే అవకాశం కన్పిస్తోంది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో అవిశ్వాసం పరంపర కొనసాగే అవకాశం లేకపోలేదు. దాంతో సిట్టింగ్‌లు తమ పదవులను కాపాడుకునే పనిలో పడ్డారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 మున్సిపాల్టీలు, నాలుగు కార్పొరేషన్లు ఉన్నాయి. మున్సిపల్ పాలకవర్గాలు ఏర్పడి నాలుగేండ్లు కావస్తుండటంతో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల వ్యతిరేక గ్రూపులు అవిశ్వాస తీర్మానాలకు తెరలేపుతున్నాయి. అధికార పార్టీ అండతో పలువురు అసంతృప్త కార్పొరేటర్లు, కౌన్సిలర్లు బిఆర్ఎస్ మేయర్లు, చైర్మన్లను గద్దెదించేందుకు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 'అవిశ్వాస' రాజకీయాలు జోరందుకున్నాయి. రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువుదీరడంతో గులాబీ పార్టీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఏడాది, రెండేళ్ల నుంచే అసమ్మతి

నాలుగేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను బిఆర్ఎస్ గెలుచుకుంది. కానీ, చాలా చోట్ల ఏడాది, రెండేళ్ల నుంచే సొంత పార్టీలోనే అసమ్మతి రాజుకుంది. మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్ల మధ్య విబేధాలు తలెత్తాయి. నిధుల కేటాయింపుల్లో పక్షపాతం, ప్రాధాన్యత కల్పించకపోవడం వల్ల పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అసంతృప్తితో రగిలిపోయారు. గతేడాది జవహర్‌నగర్ మేయర్‌తోపాటు మేడ్చల్, దమ్మాయిగూడ, మున్సిపల్ చైర్ పర్సన్లపై అవిశ్వాస నోటీసులిచ్చి తమ ఆగ్రహాన్ని బయటపెట్టారు. కానీ అప్పట్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున బీఆర్ఎస్ హైకమాండ్‌తో పాటు అప్పటి మంత్రి మల్లారెడ్డి జోక్యంతో అవిశ్వాసాలకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు ముగియడం, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో మరోసారి అవిశ్వాసం అంశం తెరపైకి వస్తోంది. అధికార పార్టీలో ఉంటే అన్ని రకాలుగా మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో మరోసారి నోటీస్‌లు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇక దమ్మాయిగూడ, మేడ్చల్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్లను సైతం గద్దె దించేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. బిఆర్ఎస్ మేయర్, చైర్ పర్సన్లను గద్దె దించేందుకు సొంత పార్టీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లే పావులు కదుపుతున్నారు.

వేడెక్కుతున్న రాజకీయం

రాష్ట్రంలో అధికార మార్పిడితో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. రాష్ట్రం అంతటా కాంగ్రెస్ గాలి వీచినా.. జిల్లాలో మాత్రం ఐదు నియోజకవర్గాల్లోనూ బిఆర్ఎస్ విజయకేతనం ఎగరేసింది. కానీ పార్టీ అధికారంలో లేకపోవడంతో రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అధికార పార్టీలో ఉంటే నిధులతోపాటు రానున్న ఎన్నికల్లో పదవులు పొందవచ్చని భావించిన జిల్లాలోని పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు చేరిపోగా.. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నాటికి మరికొందరు చేసే అవకాశమూ లేకపోలేదు. ఇక మేయర్, చైర్మన్ పీఠాలపై గురిపెట్టిన పలువురు అవిశ్వాసం ప్రవేశపెట్టి.. నెగ్గిన తర్వాత అధికార కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్టు జిల్లాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇలా చేస్తే పదవితోపాటు అధికార పార్టీ సపోర్టు కూడా ఉంటుందని కొందరు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ అవిశ్వాస రాజకీయాలు ఎక్కడి వరకు దారి తీస్తాయో తెలియాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే..!

జిఒ 142ను రద్దు చేయాలి

- కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవ వనరుల హేతబద్ధీకరణ కోసమంటూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన జిఒ 142 లోపభూయిష్టంగా ఉందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ విమర్శించింది. ఈ జిఒను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ నెహ్రూ చంద్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తీసుకోకుండా ఏకపక్షంగా విడుదల చేసిన ఈ జీవో ప్రజారోగ్యరంగానికి గొడ్డలిపెట్టు లాంటిందని తెలిపారు. టీబీ శానిటోరియం, రాష్ట్ర స్థాయి శిక్షణా కేంద్రాల ఎత్తివేత, కొన్ని పోస్టుల రద్దు నిర్ణయాలు సహేతుకంగా లేవని పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ హెల్త్ ఎడ్యుకేషన్ చేసిన హెల్త్ ఎడ్యుకేటర్లను పరిగణలోకి తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 123 ఇన్‌స్టిట్యూట్‌లను రద్దు చేస్తే 4,318 ఉద్యోగాలను కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో రద్దు కాకుండా అమలు చేసేందుకు కొంత మంది ఉన్నతాధికారులు అత్యుత్సాహంతో దొడ్డిదారిన ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జోక్యం చేసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

- ఫిబ్రవరి 16న 'మధ్యాహ్న భోజన' కార్మికుల సమ్మె : ఎస్‌వి రమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టడంలో భాగంగా లక్షలాది కుటుంబాల దగ్గరకు వెళ్లి వివరించాలని, ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాల ప్రజల కోసం 40 ఏళ్ల నుంచి కొనసాగుతున్న పథకాలకు కేంద్ర ప్రభుత్వం కోతపెడుతున్నదని విమర్శించారు. దీనివల్ల కోటిమంది కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, ప్రజలకు పథకాలు దూరం అవుతున్నాయని తెలిపారు. ఐఎల్‌సీ తీర్మానం ప్రకారం స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీసవేతనాలివ్వాలనీ, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పేదరికం, ఆకలి మొదలైన కీలక అంశాలనుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మతం పేరుతో భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అనంతరం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా వై.స్వప్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఆ యూనియన్ ఆఫీస్ బేరర్లు బాలలక్ష్మి, మాయ, కృష్ణమాచారీ, రాధాబాయి, యాకలక్ష్మి, యూనియన్ రాష్ట్ర నాయకులు విజేందర్, చిన్నన్న, గీత, రజిత, భాగ్య, సిద్ధమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులుగా చక్రవర్తుల శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ) రాష్ట్ర అధ్యక్షులుగా చక్రవర్తుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం సమావేశ మందిరంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర నాయకులతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రెం గౌరీ శంకర్ రావు ప్రధాన కార్యదర్శి నివేదిక చదివి వినిపించారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ పదవీ కాలం ముగిసినందున 2023-25 రెండేళ్లకుగానూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా చక్రవర్తుల శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్రెం గౌరీ శంకర్ రావు, రాష్ట్ర సహ అధ్యక్షులుగా షేక్ హాజీ నూరానీ, సత్యనారాయణ కాంబ్లీ, కోశాధికారిగా జగదీశ్వర్‌జీ, సంయుక్త కార్యదర్శిగా మరిపల్లి రమేశ్‌లతో పాటు గౌరవాధ్యక్షులుగా చౌడవరం చంద్రమోహన్, పెండ్యాల బ్రహ్మయ్య, గౌరవ సలహాదారులుగా సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు నూ ఎన్నుకున్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లు

- గంగాజలం కోసం పయనం
- మురాడి వద్ద మెస్రం వంశీయులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేస్లాపూర్‌లోని నాగోబా జాతర వచ్చేనెల 9న ప్రారంభం కానుంది. నాగోబా పూజకు ఉపయోగించే పవిత్ర గంగాజలం కోసం మెస్రం వంశీయులు ఆదివారం సాయంత్రం బయల్దేరారు. ముందుగా మురాడి (పురాతన ఆలయం) వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన మెస్రం వంశీయులు పీఠాధిపతి వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో చర్చించారు. అనంతరం ఖటోడ(పూజారి) హన్మంతు వీపుకు ఝరీ (కలశం)ను భద్రపరిచారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 22 తెగల మెస్రం వంశీయులు, ఖటోడలు మెస్రం కొసు, ప్రధాన్‌జీలు దాదారావ్, తిరుపతి దర్ముల ఆధ్వర్యంలో గంగాజలం కోసం కాలినడకగా వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఊరి పొలిమేర వరకు వారిని సాగ పంపారు. ఆదివారం కేస్లాపూర్ నుంచి బయలు దేరి కేస్లాగూడలో బస చేస్తారు. 22న గుంజాలకు నార్నూర్, 23న నాగల్కొండ, 24న గౌరీ జైనూర్, 25న గుమ్నూర్, లింగాపూర్, 26న ఇస్లాంపూర్ జన్నారం, 27 న మల్లాపూర్, దస్తురాబాద్, 28న హాస్తిన మడుగులోని పవిత్ర గోదావరికి చేరుకుంటారు. 28న గోదావరి నది వద్ద సాంప్రదాయ పూజలు చేసి కలశంలో పవిత్ర గంగా జలంతో తిరుగు ప్రయాణం చేసి ఉట్నూర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 30న ఇంద్రవెల్లి మండలం దొడందకు చేరుకుని బస చేస్తారు. వచ్చే నెల 5న ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుంటారు. 6న కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు వద్దకు చేరుకుని మోదుగు చెట్టుకు గంగాజలం కలశాన్ని భద్ర పరుస్తారు. నాగోబా పూజ అయ్యే వరకు మర్రి చెట్టు వద్దనే సెదతీరుతారు. ఫిబ్రవరి 9న తెచ్చిన పవిత్ర గంగాజలంతో జలాభిషేకం చేసి నాగోబా జాతరను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది.

రాష్ట్రపతి భవన్‌లో 'ఎట్ హోం'కు.. నెల్లుట్ల సర్పంచ్ దంపతులకు ఆహ్వానం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నిర్వహించే 'ఎట్ హోం' కార్యక్రమానికి రాష్ట్రంలోని జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నెల్లుట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్ల స్వరూపరాణి, భూపాల్ రెడ్డి దంపతులకు ప్రత్యేక ఆహ్వానం అందినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో గ్రామంలో చేసిన అభివృద్ధికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకున్నామని తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే ఎట్ హోం కార్యక్రమానికి హాజరవుతున్నట్టు చెప్పారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో.. 5.92 కిలోల హెరాయిన్ పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 5.92కిలోల హెరాయిన్‌ను శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దక్షిణాఫ్రికాకు చెందిన ఒక మహిళా ప్రయాణికురాలు లుసాక జాంబియా నుంచి బయలుదేరి హైదరాబాద్ రాజీవ్ గాంధీ విమానాశ్రయం మీదుగా సింగపూర్ వెళ్లడానికి ఎయిర్ పోర్టుకు వచ్చింది. ఆమె ప్రవర్తన అనుమానంగా ఉండటంతో అధికారులు ఆమెను అదుపులోకి తీసుకొని ఆమె హ్యాండ్ బ్యాగ్‌ను తనిఖీ చేశారు. డాక్యుమెంట్ హోల్డర్‌లో 5.92 కిలోల హెరాయిన్ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.41.4 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. స్మగ్లింగ్‌కు పాల్పడిన మహిళను అదుపులోకి తీసుకొని ఆమెపై ఎన్‌డిపిఎస్ చట్టం 1985 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్ ఢీకొని తల్లి, కొడుకు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసిఫాబాద్ నేషనల్ హైవేపై ఓ బైక్‌ను వెనుక నుంచి వచ్చిన కంటైనర్ ఢీ కొట్టడంతో బైక్‌పై వెళు తున్న తల్లి, కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లికి చెందిన సర్వర్ తన భార్య షహారాభాను (35), కొడుకు షేక్ ఆసిఫ్ (16)తో కలిసి ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆసిఫాబాద్ దాటిన తర్వాత జంక్షన్ వద్ద నేషనల్ హైవేపై రెబ్బెన వైపు నుంచి వస్తున్న కంటైనర్ బైకును వెనకాల నుంచి ఢీ కొట్టడంతో బైక్‌పై వెనకాల ఉన్న తల్లి, కొడుకులు పడిపోగా వారి మీది నుంచి కంటైనర్ వెళ్లింది. దాంతో వారు అక్కడికక్కడే మరణించారు. తరువాత కంటైనర్ అదుపుతప్పి రోడ్డుకు అవతలి వైపునకు వెళ్లి ఆగింది. ఇదే సమయంలో వాంకిడి వైపు నుంచి వస్తున్న లారీ కంటైనర్‌ను ఢీ కొట్టింది. ఏం జరిగిందని సర్వర్ చూసేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కళ్ల ముందు భార్య, కొడుకు మృతదేహాలను చూసి రోదించిన తీరు కలిచివేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ అతి వేగం వల్లే ప్రమాదం జరిగినట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. బంధువులు నేషనల్ హైవే పై మృతదేహాలతో నిరసన వ్యక్తం చేశారు. కాగా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పలు సంస్థలతో జెట్ సెట్‌గో ఒప్పందాలు

హైదరాబాద్ : ఎలక్ట్రో ఏరో, హారిజోన్ ఎయిర్ క్రాఫ్ట్, ఓవర్ ఎయిర్‌లతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు జెట్ సెట్ గో వెల్లడించింది. భారతదేశ ఎయిర్ మొబిలిటీ ఫ్యూచర్‌ను వేగవంతం చేయడానికి 130 కోట్ల డాలర్ల (దాదాపు రూ.10వేల కోట్ల) పైగా విలువ చేసే ఒప్పందాలను కుదర్చుకున్నట్లు పేర్కొంది. మూడు భాగస్వామ్యాల ద్వారా అడ్వాన్స్ ఎయిర్ మొబిలిటీ (ఎఎమ్) సొల్యూషన్‌లను ప్రవేశపెట్టడం ద్వారా భారతదేశ విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పులకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఇవి పట్టణ, ప్రాంతీయ స్థితిగతులలో చలనశీలత, కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరుస్తాయని జెట్ సెట్ గో సిఇఒ సహ వ్యవస్థాపకురాలు కనికా టేక్రివాల్ తెలిపారు.

'కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలి'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏజెన్సీ ఏరియాలో కల్లుగీత వృత్తి చేస్తున్న గీత కార్మికుల సొసైటీలను పునరుద్ధరించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలనీ, విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టు షాపులను తక్షణమే తొలగించాలని కల్లుగీత కార్మిక సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆదివారం హైదరాబాద్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు 16 అంశాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. మంత్రి స్పందిస్తూ త్వరలో సంఘం నాయకత్వంతో భేటీ అయిన తర్వాత సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు వి వెంకట నరసయ్య, హైదరాబాద్ అధ్యక్షులు ఎం కృష్ణస్వామి గౌడ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బోయపల్లి సుధాకర్‌గౌడ్ ఉన్నారు.

ముగిసిన వింగ్స్ ఇండియా ప్రదర్శన

- చివరి రోజు పోటెత్తిన సందర్శకులు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన వింగ్స్ ఇండియా -2024 ప్రదర్శన ముగిసింది. చివరి రోజూ ఆదివారమూ సందర్శకులు పోటెత్తారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు ఇక్కడి విమానాలు చూసి మురిసిపోయారు. ఇందులో దాదాపు 25 విమానాలు సందర్శనకు ఉంచగా.. సందర్శకులు పోటోలకు ఆసక్తిని కనబర్చారు. చాలా మంది ఎయిర్ షో, పెద్ద విమానాల పోటోలను తీయడంలో బిజీగా గడిపారు. అతిపెద్ద ఆకర్షణగా ఎయిర్ షో నిలిచింది. భారత వైమానిక దళం సారంగ్ హెలికాప్టర్ బృందం విన్యాసాలు చూపరులను అబ్బురపర్చారు. ఆకాశంలో విమానం నుండి రంగు రంగుల పొగతో ఆకర్షణీయ విన్యాసాలు చేశారు. భారీగా వచ్చిన సందర్శకులు కంచెను దాటకుండా భద్రతా సిబ్బంది చర్యలు తీసుకునారు. ప్రదర్శనలో ప్రతి విమానం పక్కన 30 అడుగుల మేర బారికేడ్లు ఏర్పాటు చేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయా సందర్శించారు. సారంగ్ బృందంతో ఆయన ముచ్చటించారు.

వింగ్స్ ఇండియా ప్రదర్శనను వీక్షించేందుకు వస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

వింగ్స్ ఇండియా ప్రదర్శనను వీక్షిస్తున్న సందర్శకులు

వింగ్స్ ఇండియా ప్రదర్శనను వీక్షించేందుకు తరలివస్తున్న స్రందర్శకులు

ప్రశ్నించేతత్వాన్ని అణచడానికే విద్యావ్యవస్థ ధ్వంసం

- కార్మికోద్యమాల్లో ప్రభుత్వ విద్య, వైద్యం డిమాండ్లు ఉండాలి : ప్రొఫెసర్ హరగోపాల్
- ప్రభుత్వ విద్య అనే అంశం ప్రజా ఉద్యమంగా మారాలి : ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి
- అందరికీ నాణ్యమైన విద్య అందించాలి : చావా రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమను ప్రశ్నించే సమాజం ఉండొద్దనీ, ప్రశ్నించే మనుషులు ఉండకూడదనే లక్ష్యంతోనే పాలకులు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటు విద్యారంగం ఒక మాఫియాగా మారిందని ఆరోపించారు. విద్య, వైద్యం ప్రజా సంక్షేమం అనే భావన నుంచి పాలకులు వైదొలిగారని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ విద్య, వైద్యం అందించడం హక్కు అనే డిమాండ్‌ను కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు ఉద్యమాల్లో భాగం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. కెసిఆర్ పాలనలో మన విద్యావ్యవస్థ 30 ఏళ్లు వెనక్కి పోయిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వమూ విద్యపట్ల అదే ధోరణితో ముందుకెళ్తే తెలంగాణలోని ఒక జనరేషన్ మొత్తం నష్టపోతుందని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'రాష్ట్రంలో విద్యారంగ స్థితి-ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఎస్వీకే మేనేజింగ్ ట్రస్టు కార్యదర్శి ఎస్.వినయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రాల మీద బలవంతంగా రుద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వాలు విద్యారంగం మీద నిధులు వెచ్చించడాన్ని ఖర్చుగా చూడొద్దనీ, పెట్టుబడిగా చూడాలని సూచించారు.తెలంగాణలోని యూనివర్సిటీల్లో ప్రమాణాలు దెబ్బతిన్నాయనీ, జాతీయ స్థాయి పరీక్షల్లో విద్యార్థులు రాణించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్న యూనివర్సిటీలకు నిధులిచ్చి, ఫ్యాకల్టీని నియమిస్తే మంచి ఫలితాలు సాధించొచ్చన్నారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ..ప్రైమరీ, ప్రీప్రైమరీ స్కూళ్లను విలీనం చేయాలన్నారు. ప్రీప్రైమరీ విద్య అందించకపోవడం వల్లనే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయవేటు స్కూళ్లకు పంపుతున్నారని చెప్పారు. వర్సిటీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రొఫెసర్లను నియమిస్తే చాలనీ, రాష్ట్రంలో ప్రయివేటు వర్సిటీల ఏర్పాటు అవసరం లేదని చెప్పారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అనే అంశాలను వ్యవసాయ కార్మిక, రైతు, కార్మిక సంఘాలు తమ పోరాటాల్లో ఎజెండాగా చేర్చుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. టిఎస్‌యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి చావా రవి మాట్లాడుతూ.. కేరళ తరహాలో ప్రభుత్వవిద్యాసంస్థల బలోపేతానికి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బడ్జెట్‌లో విద్యకు నిధులు ఎక్కువగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయాలనీ, మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ఎస్వీకే ట్రస్టు సభ్యులు బుచ్చిరెడ్డి విద్యారంగంపై చర్చాగోష్టి ముఖ్యాంశాలను వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ పౌరస్పందన వేదిక నాయకులు రాధేశ్యామ్, టిపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు టి.లక్ష్మారెడ్డి, మాణిక్‌రెడ్డి, టీఎస్‌ఎమ్‌ఎస్‌టీఎఫ్ నాయకులు బి.కొండయ్య, మహేశ్, క్రాంతికుమార్, రంజిత్‌కుమార్, బాలోత్సవ కమిటీ నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, సుజావతి, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.